క్లుప్తంగా

అసాంఘిక కార్యక్రమాలకు చెక్

• రూరల్ సీఐ లక్ష్మణరావు



మాట్లాడుతున్న రూరల్ సీఐ లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా, పేకాట, వ్యభిచారం నిర్వహణ వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు రూరల్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో వీటీ అగ్రహారం శివారులో వ్యభిచారం చేస్తున్న నిర్వాహకురాలితో పాటు విటులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అలాగే చెల్లూరు, రఘుమండ, గాంధీనగర్, జమ్ములో గంజాయి, పేకాట స్థావరాలపై దాడులు చేశామని తెలిపారు. నగర శివారు ప్రాంతాలైన జేఎన్టీయూ, గుంకలాం, ద్వారపూడి వంటి ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

లీజుదారులకు పత్రాల అందజేత



లీజుపత్రాలు అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజులు

విజయనగరం: నగరంలోని రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంతంలో నిర్మించిన దుకాణాలను దక్కించుకున్న లీజుదారులకు అసిస్టెంట్ కమిషనర్ కె.అప్పలరాజులు గురువారం పత్రాలు అందజేశారు. ఆ ప్రాంతంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొత్తం 22 దుకాణాలను నిర్మించగా... గతేడాది అక్టోబర్ నెలలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. మొత్తం 22 షాపుల్లో ఒకటి మినహా మిగిలిన షాపులను దక్కించుకున్న లీజుదారులకు పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఎస్టీ మహిళ క్యాటగిరీకి చెందిన ఒక షాపునకు వేలంపాట నిర్వహించాల్సి ఉందన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

• సీడీపీఓ ప్రసన్న



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: మానవ అక్రమ రవాణను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ జి. ప్రసన్న అన్నారు. ఐసీడీఎస్, నేచర్ సంస్థ, కార్మికశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వర్క్ షాపులో ఆమె మాట్లాడుతూ.. అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాధితులకు అందుబాటులో ఉన్న విధానాలను వివరించి, వారి హక్కులను ఎలా కాపాడుకోవాలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ ఉప కమిషనర్ ప్రసాదరావు, నేచర్ సంస్థ డైరెక్టర్ ఎస్. వికాస్ బాలరాజు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ రోగులకు మెరుగైన భోజనం



సర్వజన ఆస్పత్రిలో భోజనాన్ని పరిశీలిస్తున్న టీమ్ లీడర్ జనార్దనరావు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ రోగులకు మెరుగైన భోజనం అందించాలని ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) టీమ్ లీడర్ తుంపిల్లి జనార్దనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ రోగులకు అందించే భోజనాన్ని గురువారం పరిశీలించారు. అన్నం, సాంబరు, పప్పు, కూరలను రుచి చూశారు. అనంతరం డయాలసిస్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డయాలసిస్ సిబ్బంది డబ్బులు ఏమైనా అడుగుతున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పూర్తి ఉచితమని తెలిపారు. సిబ్బంది డబ్బులు అడిగినా, సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించినా ఆరోగ్యమిత్రకు తెలియజేయాలని సూచించారు.

నియామకాలు..

విజయనగరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగంలో పలువురు జిల్లా నాయకులకు స్థానం లభించింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్రం కార్యాలయం పలు నూతన నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా గర్భాపు రామారావు, ఆఫీసియల్ స్పోక్స్ పర్సన్‌గా రేగాన శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా రాజన్న చిన్నయ్యలకు చోటు కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పదవులు పొందిన జిల్లా నాయకులు స్పష్టం చేశారు.

ఈకేవైసీ చేయకపోతే రేషన్ కట్

• ఈ నెల 31లోగా చేయించుకోవాలి..
• ఆందోళనలో లబ్ధిదారులు



ఈ పోస్ యంత్రాల్లో ఈకేవైసీ నమోదు చేస్తున్న దృశ్యం

విజయనగరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా సంక్షేమ పథకాల అమలు మాట అలా ఉంచితే.. ఉన్న సంక్షేమానికి చిల్లు పడే పరిస్థితి నెలకొంది. రేషన్‌కార్డులోని సభ్యులకు ఈకేవైసీ పూర్తి చేసి, కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించటమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు హడావుడి చేస్తున్నారే కానీ యంత్రాంగం నిర్లక్ష్యంతో ఈకేవైసీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రక్రియను పూర్తి చేయడంలో భాగంగా డీలర్ల వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రాల్లో రేషన్‌కార్డులోని సభ్యుల అందరి వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ క్రమంలో ఇంతవరకు ఈకేవైసీ చేయించుకోని వివరాలను డీలర్లకు అందించారు. ఈకేవైసీ నమోదు చేసుకోకపోతే రేషన్ ఆగిపోతుందనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో ఈకేవైసీ ఎవరు చేయించుకోవాలి.. ఎక్కడ చేయించుకోవాలో తెలియక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

తక్కువ సమయమే..

గతంలో ఈకేవైసీ చేసుకోని వారికి ఈ నెల 11 నుంచి అవకాశం కల్పించారు. అధికారిక లెక్కల ప్రకారం విజయనగరం నియోజకవర్గంలో 77,256 రేషన్ కార్డులున్నాయి. ఆయా రేషన్ కార్డుల్లో సభ్యులుగా 2,12,977 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 1,96,427 మంది ఈకేవైసీ నమోదు పూర్తి చేసుకోగా.. మరో 16, 550 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది. నియోజకవర్గం పరిధిలో గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు రేషన్ డీలర్ల వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రాల ద్వారా ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉండగా.. తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. సచివాలయాల్లో సక్రమంగా చేయడం లేదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు గడువు విధించడంతో మిగిలిన నాలుగు రోజుల్లో ఈకేవైసీ నమోదు ఎంతవరకు సాధ్యమవుతుందో చూడాలి. ఈ ప్రక్రియపై పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వేగంగా ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ఇదే విషయమై సీఎస్‌డీటీ రామారావు వద్ద ప్రస్తావించగా... ఈనెల 31లోగా ప్రతి రేషన్ లబ్ధిదారుడు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

• జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యాలనాయుడు



బోరును ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలని జిల్లా విద్యాశాఖాధికారి యు. మాణిక్యాలనాయుడు అన్నారు. మండలంలోని పతివాడ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎస్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో సుమారు 1.30 లక్షలతో ఏర్పాటు చేసిన చేతి బోరును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందన్నారు. తల్లిదండ్రులు పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు తమ పిల్లల విద్యా ప్రమాణాలపై ఆరా తీయాలని సూచించారు. హెచ్ఎస్ ఫౌండేషన్ వంటి సంస్థలు పాఠశాల అభివృద్ధిలో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె. వెంకటరమణ, హెచ్ఎస్ ఫౌండేషన్ డైరెక్టర్ ఎస్‌వీఎన్ మూర్తి, సంస్థ ప్రతినిధి రోజారమణి, మండల విద్యాశాఖ అధికారి బి. పాపినాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. సూర్యకుమారి, సర్పంచ్ పైడిరామ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సౌకర్యాలు మెరుగుపరచండి



వినతిపత్రం అందుకుంటున్న మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తహీరా సుల్తాన్

విజయనగరం అర్బన్: జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో వసతి, మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా పర్యటనలో భాగంగా పట్టణానికి వచ్చిన మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తహీరా సుల్తాన్‌ను జిల్లా కమిటీ ప్రతినిధులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మోడల్ స్కూల్స్‌లో సర్వీస్ రూల్స్‌ను విడుదల చేయాలని.. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు కాకుండా రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని కోరారు. జాయింట్ డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బుఖారిబాబు, ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్, జిల్లా నాయకులు కె.వెంకునాయుడు, తదితరులున్నారు.

ఏప్రిల్ 1న కలెక్టరేట్ వద్ద ధర్నా



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: ఉపాధి వేతనదారులకు వెంటనే బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏప్రిల్ ఒకటో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. జగన్ మోహనరావు తెలిపారు. మండలంలోని దుప్పాడ, జొన్నవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించి, వేతనదారులతో మాట్లాడారు. బకాయిలు చెల్లించడం.. పనుల వద్ద తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయడం..గునపాలు, తట్టలు మంజూరు చేయడం.. ట్రావెలింగ్ అలవెన్స్ మంజూరు చేయడం.. వంటి డిమాండ్లతో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పెట్రోల్ బంకుల్లో మోసాలపై నిఘా..



లీగల్ మెట్రాలజీ ఏసీకి వినతిపత్రం అందజేస్తున్న పౌరవేదిక ప్రతినిధులు

విజయనగరం గంటస్తంభం: అనంతపురం జిల్లాలోని ఒక పెట్రోల్ బంక్ యాజమాని వినియోగదారులను అక్రమంగా దోచుకున్న తీరు సోషల్ మీడియా, టీవీ చానళ్లలో ప్రసారం కావడంతో.. అటువంటి సంఘటనలు విజయనగరం జిల్లాలో జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈమేరకు జిల్లా తూనికలు, కొలతల శాఖ సహాయ నియంత్రకుడు పీవీ రంగారెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరుగుతున్నప్పటికీ అదే స్థాయిలో మోసాలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీలు, మోసాలు జరగకుండా పెట్రోల్ బంకులపై నిఘా పెట్టాలని కోరారు. కార్యక్రమంలో పౌరవేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, సహాయ కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్ పాల్గొన్నారు.

వినియోగదారులకు చేరువగా ఏపీజీవీబీ సేవలు

• ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ రామకృష్ణరాజు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ రీజనల్ మేనేజర్ రామకృష్ణరాజు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలను వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామని ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ దంతులూరి రామకృష్ణరాజు అన్నారు. కొత్తపేట బ్రాంచ్ కార్యాలయాన్ని స్థానిక కెనరా బ్యాంక్ పక్కనున్న నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు కంప్యూటరైజ్డ్ సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సునీత వర్మ, డి.గణేష్, గంటా అప్పలనాయుడు, కేవీఎస్‌వీఎన్ రాజు, పద్మప్రియ, రమాదేవి, రమణబాబు, ఖాతాదారులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు బంగారయ్యను సత్కరిస్తున్న హెచ్ఎం సత్యం, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివుకు బంగారయ్యను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా సత్కరించారు. బంగారయ్య ఇటీవల హైదరాబాద్‌లో హైకోర్టు విశ్రాంత జడ్జి జి. చంద్రయ్య చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన్ను ఘనంగా సన్మానించి, విద్యాభివృద్ధికి బంగారయ్య చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీను, హెచ్ఎం సత్యం, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా అప్పలనారాయణమ్మ



ఉప సర్పంచ్‌గా ఎన్నికైన వాకాడ నారాయణమ్మతో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు



నెల్లిమర్ల రూరల్ : ఉప సర్పంచ్ తాళ్లపూడి రమణకు శుభాకాంక్షలు చెబుతూ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



విజయనగరం: నారాయణపురం గ్రామ వైస్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నక్కాన ఆదిలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పెద్దలు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేట పంచాయతీ ఉప సర్పంచ్‌గా వాకాడ అప్పలనారాయణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అవగాహన ఒప్పందంలో భాగంగా ఉప సర్పంచ్ పదవికి బడ్డుకొండ రామ్మోహన్ రాజీనామా చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మహ్మద్ హిదాయత్ పాషా ఆధ్వర్యంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. దీంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారైన 7వ వార్డు మెంబర్ వాకాడ నారాయణమ్మను సహచర మెంబర్లు ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఈ మేరకు అప్పలనారాయణమ్మను జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, సర్పంచ్ పైల ముత్యాలరావు, మాజీ సర్పంచ్ పైల ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బడుకొండ రామ్మోహన్, రామునాయుడు, ఎర్ర పైడిరాజు, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భవానీ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పూతికపేట ఉప సర్పంచ్‌గా రమణ..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట ఉప సర్పంచ్ స్థానానికి నిర్వహించిన ఎన్నిక ప్రశాంత వాతావరణంలో ముగిసింది. గ్రామంలో మొత్తం ఎనిమిది మంది వార్డు మెంబర్లు ఉండగా..వీరిలో ఆరుగురు వార్డు మెంబర్లు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్నారు. గతంలో ఉప సర్పంచ్‌గా పనిచేసిన పత్తిగిడి కృష్ణ రెండున్నరేళ్ల ఒప్పందం ప్రకారం తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఉప సర్పంచ్ రేసులో ఉన్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు తాళ్లపూడి రమణకు పూర్తి స్థాయిలో సభ్యుల మెజార్టీ ఉన్నప్పటికీ కూటమి నాయకులు విపరీతమైన ప్రలోభాలకు గురిచేశారు. గ్రామంలోని ఓ వార్డు మెంబర్‌కు ఏకంగా రూ.లక్ష ఇస్తామని ప్రకటించినప్పటికీ కూటమికి మద్దతు పలికేందుకు అంగీకరించలేదు. మిగతా వార్డు మెంబర్లు కూడా ప్రలోభాలకు తలొగ్గకపోవడంతో ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు తాళ్లపూడి రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఉపసర్పంచ్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ లెంక మంగమ్మ, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లెంక గోవింద, వార్డు మెంబర్లు పత్తిగిడి కృష్ణ, సుంకరి అప్పలనారాయణ, శీల కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఏకగ్రీవం

విజయనగరం: మండలంలోని దుప్పాడ, నారాయణపురం గ్రామాల్లో నిర్వహించిన ఉప సర్పంచ్‌ల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆయా గ్రామాల్లో ఎన్నికల సమయంలో జరిగిన జెంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం గడువు పూర్తి కావడంతో ఇంతవరకు ఉప సర్పంచ్‌గా ఉన్న వారు రాజీనామ చేయగా... కొత్తగా మళ్లీ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలుపొందారు. దుప్పాడ వైస్ సర్పంచ్‌గా జి. పైడిరాజు, నారాయణపురం వైస్ సర్పంచ్‌గా నక్కాన ఆదిలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు విజేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థుల ప్రతిభ..



డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ నిర్వహించిన దీన్‌దయాల్ స్పార్స్ యోజన స్కాలర్‌షిప్ టెస్ట్‌లో నగరంలోని మాన్సాస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో 6వ తరగతి చదువుతున్న ఎల్.నందిని, 9వ తరగతి చదువుతున్న టీవీ సాయిమనోజ్ ప్రతిభ కనబరిచి రూ.6 వేలు చొప్పున ప్రతిభా స్కాలర్‌షిప్‌లు పొందారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జీవీఎస్ఎస్ సుబ్బారావు, ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, తదితరులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

– విజయనగరం

సన్మానం..



భోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన వైస్ ఎంపీపీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ చెందిన పచ్చిపాల నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆమెకు ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు), ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి జ్ఞాపిక అందజేసి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

– భోగాపురం

విద్యార్థులకు చేయూత..



నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాల్సిన ఆవశ్యకత స్వచ్ఛంద సంస్థలపై ఉందని అఖిలభారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు రాంకీ పిలుపునిచ్చారు. సినీనటుడు రామ్‌చరణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నూతివారి పాఠశాల విద్యార్థులకు గురువారం పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రంగనాయకులు, నానాజీ, యోగేష్ దాసరి, క్యాంటీన్ శ్రీను, రమేష్, గంజిపేట శ్రీను, చంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

వార్డు పర్యటన..



విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్‌లో అధికారులు గురువారం వార్డు పర్యటన చేశారు. రామారాయుడు రోడ్డు పీజీ స్టార్ హాస్పటల్ నుంచి ప్రారంభమైన వార్డు పర్యటనలో అసిస్టెంట్ కమిషనర్ కె.అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టీపీఓ అప్పలరాజు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

– విజయనగరం

గురునారాయణ కళాపీఠం వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు బీఏ నారాయణ, తదితరులు

విజయనగరం టౌన్: గురునారాయణ కళాపీఠం నాలుగో వార్షికోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బీఏ నారాయణ తెలిపారు. గురువారం స్థానిక మయూరా హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ ఒకటో తేదీన ఆనందగజపతి ఆడిటోరియం వేదికగా సాయంత్రం 4 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ప్రముఖ చలనచిత్ర గాయని ఎస్పీ శైలజ, శుభలేఖ సుధాకర్ దంపతులకు జీవిత సాఫల్య పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రముఖ తబలా కళాకారుడు బగ్గాం ధనుంజయను సత్కరించనున్నట్లు చెప్పారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ జి.సన్యాసమ్మ మాట్లాడుతూ.. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రముఖ గాయని, పద్మభూషణ్ డాక్టర్ పి.సుశీలమ్మ హాజరుకానున్నారన్నారు. రాత్రి 7.30 గంటలకు నిర్వహించే సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథిగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, శాసనసభ మాజీ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో మయూరా హోటల్ అధినేత యార్లగడ్డ లలితకుమారి, బాబూరావు, కోశాధికారి బి.పద్మావతి, నాగేంద్రప్రసాద్, సురభి శ్రావణి, చీకటి చంద్రిక, వైవీ సత్యనారాయణ (అబ్బులు), తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలి

• అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భోగాపురం: విద్యార్థులు మంచి నడవడికతో తల్లిదండ్రులు, గురువుల నమ్మకాన్ని నిలబెడుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మాజీ మంత్రి, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బసవపాలెం అవంతి రీసెర్చ్ టెక్నాలజికల్ అకాడమీలో ప్రిన్సిపాల్ గోవిందరావు ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం నిర్వహించిన ఏఎస్‌టీఆర్‌ఏ 2కె25 యాన్యువల్ వేడుకలను మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్య సాధన కోసం నిరంతరం కష్టపడి చదువుకోవాలన్నారు. భవిష్యత్‌లో అవంతి విశ్వవిద్యాలయం స్థాపించడమే తమ ధ్యేయమని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ, టంకాల సురేష్‌కుమార్, కె. బాబులు, గవర్నమెంట్ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ, అవంతి విద్యా సంస్థల ప్రతినిధి ఎం. మహేష్, మల్లేశం దొర, కె. భాస్కరరావు, కళాశాల ఏఓ అశోక్‌కుమార్, వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని ముక్కాం, కొంగవానిపాలెం, మెట్టసబ్బన్నపేట, నందిగాం, తోటపల్లి, దిబ్బలపాలెం, చేపలకంచేరు, బమ్మిడిపేట, గాబువానిపేట, కొండ్రాజుపాలెం, రామచంద్రపేట గ్రామాల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు బీసీ రుణాల లబ్ధిదారుల ఎంపిక

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ మహిళలకు రుణాలు మంజూరు చేసేందుకు అవసరమైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించే ఎంపిక ప్రక్రియను మొదటి రోజు శుక్రవారం 1 నుంచి 30 డివిజన్‌ల పరిధిలో గల దరఖాస్తుదారులకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా శనివారం 31 నుంచి 50 డివిజన్‌ల పరిధిలో గల దరఖాస్తుదారులకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎంపిక ప్రక్రియ చేపడతామన్నారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 366 యూనిట్లు మంజూరు కాగా.. 2,820 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

నెల్లిమర్ల: బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేయనున్న రాయితీ రుణాలకు సంబంధించి ఈ నెల 29న నగర పంచాయతీ పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ అప్పలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ కల్యాణ మంటపంలో ఉదయం 10 గంటల నుంచి బ్యాంక్ ప్రతినిధులతో కలిసి ఇంటర్వ్యూలు చేపడతామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తు, రేషన్ కార్డు, ఆధార్, ఆదాయ, కుల, తదితర ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న, వచ్చే నెల 2న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 675 మంది రుణాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

నేడు దరఖాస్తుల పరిశీలన

డెంకాడ: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులందరూ తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో శుక్రవారం ఉయదం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో హాజరుకావాలని ఎంపీడీఓ భవానీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ అధికారులు, ఎంపీడీఓ సమక్షంలో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ కె. అప్పలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో 20 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధికారులు పాల్గొనాలని కోరారు.